# శ్రీరస్తు శుభమస్తు



మా అమ్మ వాళ్ళ పెద్దక్కయ్య పేరు రాజేశ్వరి. రాజ్యం ఆమ్మ అని పిలిచేవాళ్ళం. మా పెద్దనాన్న పేరు వెంకట్రావు. వాళ్ళు అమలాపురంలో వుండేవాళ్ళు. మా పెద్దనాన్నకి ఒక చిన్న పుస్తకాలషాపు వుండేది. మా ఆమ్మ సన్నగా చిన్నగా ఉండేది. నిదానంగా మాట్లాడేది. కమ్మగా వంట చేసేది. తియ్యగా పాటలు పాడేది. కానీ పెద్దనాన్నంటే అందరికీ భయమే. ఇంత అల్లరి చేసే నేను కూడా అయనకి కనపడకుండా తప్పించుకు తిరిగేదాన్ని. ఆ మాటకొస్తే మా అమ్మక్కూడా భయమే. బాబోయ్ పెద్దబావ అని పక్కకి తప్పుకునేది. అలా ఎలా ఆనవాయితీలొస్తాయో! మా ఆయనంటే కూడా మా చెల్లెళ్ళందరికీ భయమే! ఆయన హాల్లోకి రాగానే చేపల మార్కెట్టు కాస్తా టీచరున్న క్లాసులాగా అయిపోతుంది. మా రాజ్యం ఆమ్మకి ముగ్గురు

కొడుకులు. శత్రుఘ్నుడు తక్కువైన దశరథపుత్రుల్లా వుండేవారు. చాలా ఏళ్ళ తర్వాత ఆ శత్రుఘ్నుడు కూడా చేరాడు అనుకోండి. ఇకనుంచీ నేను చెప్పే కథల్లో అన్నయ్యలు అంటే వాళ్ళేనని మీరు అర్థం చేసుకోవాలి. లేకపోతే నాకు అన్నయ్యలెక్కడున్నారు? నేనే పెద్ద కదా మా ఇంట్లో!

అన్నయ్యలందరూ రాజస్థాన్‌లో వున్న పెద్ద కాలేజి పిలానీలో చదువుకున్నారు. వేసవికాలం సెలవుల్లో సగంరోజులు మా ఇంట్లో గడిపాకే అమలాపురం వెళ్ళేవారు. అపుడు మమ్మల్ని కూడా తీసుకువెళ్ళేవారు. మాకోసం రాజస్థాన్ నుంచి రకరకాల మిఠాయిలు పెద్ద పెద్ద డబ్బాల్లో తెచ్చేవారు. వాటిలో రాజభోగ్ రుచిని నేనెప్పటికీ మర్చిపోలేను. అవి మీరెప్పుడయినా తిన్నారో లేదో! రసగుల్లాకి మూడురెట్లు సైజులో గులాబిరంగులో ముదరపాకంతో బరువుగా వుంటాయి. అవకాశం వస్తే తప్పక రుచి చూడండి. అలాగే ఇంకోటి 'మేవా కీ కచోరీ'. అది గాని పొద్దున్నే ఒకటి తింటే రాత్రి వరకు మంచినీళ్ళు కూడా తాగలేం. ముగ్గురన్నయ్యలూ మూడు రకాలుగా వుండే వాళ్ళు. పెద్దన్నయ్యకి కాస్త కోపం ఎక్కువ. బుల్లెన్నయ్య సరదాగా పాటలు పాడుతూ అందర్నీ ఇమిటేట్ చేస్తూ నవ్వించేవాడు. మాతో సమానంగా అల్లరి చేసేవాడు.

వాళ్ళిద్దరిలో మధ్యవాడు మా రాజన్నయ్య. నిజంగానే పాండవ మధ్యముడిలాగానే వుండేవాడు. చాలా అందంగా గులాబీరంగులో నొక్కునొక్కుల జుట్టుతో ఒక్కొక్కపుడు దేవానంద్‌లాగా, ఇంకొప్పుడు నాగేశ్వర్రావులాగా వుండేవాడు. చాలా స్టైలుగా వుండేవాడు. ఎక్కువగా ఇంగ్లీషులో మాట్లాడేవాడు. పాటలు కూడా ఇంగ్లీషో, హిందీవో పాడుతూ వుండేవాడు. మాకు అవే నేర్పేవాడు. ఇంక భోజనం దగ్గరయితే కారాలు తినేవాడు కాదు. రొట్టెలూ, కూరలూ, పచ్చి కూర ముక్కలూ తినేవాడు. చాలా పళ్ళు తినేవాడు. లాంచిలో ప్రయాణం చేసేటప్పుడు కూడా మాచేత కొబ్బరినీళ్ళు తాగించి, చేతులో అరిటిపళ్ళు కొనిపెట్టేవాడు. పుణుకులు బాగుంటాయ్ అన్నయ్యా లాంచీలో తినడానికి అని ఏడ్చి గోలపెట్టినా వినిపించుకునేవాడు కాదు. పైగా నూనె సరుకులు తినకూడదనేవాడు. ఆ చిన్నతనంలో వుండే ప్రేమలకి విలువ కట్టలేం. అసలు వాళ్ళు మా సొంత అన్నయ్యలు కాదని ఎవరైనా అంటే నేను నానా గోలా చేసేదాన్ని. మా పెద్దన్నయ్య పెళ్ళిలో "నాకేవీ లాంఛనాలూ! ఆ అమ్మలు మొద్దుకిచ్చారూ.." అని ఏడుస్తుంటే మా చెల్లాయి పిన్ని చెప్పింది "అసలు చెల్లెళ్ళకే లాంఛనాలు జరుపుతారు! మీలాటి వరస చెల్లెళ్ళకి కూడా లాంఛనాలంటే ఎవరివల్లా జరిగేపని కాదు. ఎలాగూ నీకు బట్టలు పెడతారు వూరుకో" అని వూరుకోపెట్టింది.

వరస చెల్లెళ్ళమని మాకో పేరు పెట్టినందుకు మా పిన్నిని చంపేద్దామనుకున్నా గానీ పోన్లే అప్పుడప్పుడు కొయ్యిరొట్టి చేసిపెడుతుంది కాదా అని వదిలేశాను. పైగా పెద్దన్నయ్య పెళ్ళినాటికి నేను చాలా చిన్నదాన్ని. గుంటూర్లో నాలుగోక్లాసు చదివేదాన్ని. నేను కాస్తపెద్దయేటప్పటికి మా నాన్నకి బెజవాడలో కృష్ణాబారేజి కట్టే పని పడింది. ఎప్పుడూ వచ్చిపోయే చుట్టాలతో అమ్మకి చేతినిండా పనుండేది. అప్పటికి పెద్దన్నయ్యకి ముగ్గురు మగపిల్లలు వరసాగ్గా పుట్టేశారు. జోధ్పూరు యూనివర్సిటీలో లెక్చరరుగా పనిచేస్తూ వుండేవాడు.

ప్రతి వేసంకాలంలోనూ మా అన్నయ్య వదినా పిల్లలతో సహా వచ్చి మా ఇంట్లో పది పదిహేనురోజులుండి అప్పుడు అమలాపురం వెళ్ళేవాడు. తిరుగుప్రయాణంలో మాత్రం మా ఇంటికి వచ్చే టైముండేది కాదు. విజయవాడ వరకు ఒక రైల్లో వచ్చి అక్కడే ప్లాట్‌ఫారం మీద కూచుని మద్రాసునుండి ఏ అర్థరాత్రో జి.టి. రాంగానే ఎక్కి ఢిల్లీ వెళ్ళిపోయేవారు. ఫలానారోజున వస్తారని తెలియగానే అమ్మ నాలుగురోజులకి సరిపడా పూరీలూ, పులిహోరా, పెరుగన్నం, గోంగూరపచ్చడీ, పాలూ వగైరాలన్నీ కాన్లలో పెట్టి ఇచ్చేది. అవన్నీ తీసుకుని పనివాడ్ని తోడు తీసుకుని స్టేషనుకు వెళ్ళి కూచునేదాన్ని. నన్ను చూడగానే వదిన తన దగ్గర వున్న డబ్బాల్లోకి అమ్మ ఇచ్చినవన్నీ ట్రాన్ఫరు చేసి ఖాళీ డబ్బాలు పనివాడికిచ్చేసేది. రైల్లోకి ఎక్కగానే హేమక్కు కట్టి చంటివాడ్ని పడుకోపెట్టేది. రెండు బెర్తుల మధ్యా శుభ్రంగా తుడిచి పాత జంపఖానా వేసి పైన రజాయి వేసి పైవాళ్ళిద్దరినీ పడుకోపెట్టేది. మధ్యలో దిండు పెట్టగానే వాళ్ళిద్దరి తలలూ ఆ దిండు మీద పెట్టుకుని చెరోవైపుకీ కాళ్ళు పెట్టుకుని హాయిగా నిద్రపోయేవారు. ఒక తాడుకు రెండు పల్చటి దుప్పట్లు కట్టి కిటికీలకడ్డంగా కట్టేవారు. రైలు వెడుతున్నంతసేపూ వాటి మీద నీళ్ళు జల్లుతుంటే చల్లగా వుండి పిల్లలకి ఎండదెబ్బ కొట్టకుండా వుంటుందిట. ఒక్క పదినిముషాల్లో రైలు పెట్టిని ఇల్లులాగా మార్చేసేవారు వాళ్ళిద్దరూ కలిసి. ఇంక రైలు బయలుదేరిపోతుందేమోనని దిగబోతుంటే అప్పుడు పెట్టేది వదిన నా చేతిలో అమలాపురం అమ్మ చేసిచ్చిన లస్కోరావుండల డబ్బా. "బాగా చదువుకో సుశీలా! నువ్వు బాగా చదువుకుంటే నిన్ను కూడా నాలాగా లెక్చరర్ని చేస్తా. అందరిళ్ళకీ తిరుగుతూ టైం వేస్ట్ చేసుకోకు. జాగ్రత్తగా ఇంటికెళ్ళు" అని నూటపదిహేను జాగ్రత్తలు చెప్తూ ఇంటికి పంపేవాడు అన్నయ్య. ఈయనగారిచ్చే ఈ లెక్చర్లన్నీ అమ్మ మోసిన చాడీల ఫలితమే కాదా అని దులిపేసుకునేదాన్ని. ఇంక మా అమ్మ ఇచ్చిన అన్నాలన్నీ తినుకుంటూ మూడోరోజు పొద్దున్నకి ఢిల్లీ చేరతారు. పగలల్లా ఢిల్లీ ప్లాట్‌ఫారం మీద పడుండి, వీలు చూసుకుని ఏ వెయిటింగ్ రూంలోచో స్నానాలు చేసి

సాయంత్రానికి పాతఢిల్లీ స్టేషనుకి చేరి జోధ్పూర్ మెయిల్ ఎక్కేవాళ్ళు. మర్నాడు మధ్యాహ్నం 2 గంటలకి వాళ్ళ వూరు వచ్చేస్తుంది. ఇదీ సంక్షిప్తంగా పెద్దన్నయ్య రాకపోకల కథ.

ఇంక రాజన్నయ్య చదువయిపోగానే అక్కడే రీసెర్చిలో చేరాడు. పైగా ఐ.ఎ.ఎస్. పరీక్షలకి కట్టాడు. రాతపరీక్షలు పాసయి ఇంటర్వ్యూ కూడా అయ్యాక "అంతా బాగా చేసాను పిన్నీ! ఏదో ఒకదాంట్లో సెలక్షనొస్తుందని" అమ్మకి ఉత్తరం కూడా రాశాడు. చూస్తుండగానే తను కలెక్టరు కాదు గానీ అలాంటిదాంట్లోనే ఇంకోదాంట్లో సెలక్టయ్యాడు. ఆ వార్త తెలిసినరోజు మా అమ్మ సంతోషం పట్టలేక కాజాలు చేసి అందరికీ ఇచ్చింది. మా అందరినీ సినిమాకి పంపించింది. అన్నయ్య అంత పెద్ద ఆఫీసరయ్యాడని భూమికి ఆరంగుళాల ఎత్తున నడుస్తున్నానని మా అమ్మ నన్ను వేళాకోళం చేసేది. తనకెంత వుద్యోగం వస్తే మాత్రం నాకేం లాభం! వరసాడబడుచులకి లాంఛనాలు చేస్తారా ఏవన్నానా!

సిమ్లా ట్రైనింగుకి వెళ్ళేముందు మమ్మల్ని, ఆమ్మావాళ్ళని చూడ్డానికి రాజన్నయ్య వచ్చాడు. తను వచ్చిన గంటసేపట్లోనే "రాజారావుగారిని కలవడానికి హైదరాబాదు నుంచి వచ్చానంటూ" ఒక ఖద్దరు బట్టలు ధరించిన పెద్దమనిషి మా ఇంటికొచ్చారు. ఇదివరకు కూడా ఒకసారి వచ్చారట కానీ నేనప్పుడు ఇంట్లో లేకపోవడంతో నాకా విషయం తెలియలేదు. అసలంతదూరం నుంచి మా అన్నయ్యని కలవడానికి ఎందుకొచ్చాడో నాకయితే తెలియలేదు. నేనడిగినా అమ్మ నాకన్నీ చెప్పదు. పైగా కోప్పడుతుంది.

ఈలోగా బారేజి కట్టడం పనులయిపోవడంతో కంపెనీవాళ్ళు తమ వుద్యోగులని తలా ఒక వూరు ట్రాన్స్ఫరు చేసేస్తూ మా నాన్నని హైదరాబాదు వెళ్ళమన్నారు. దాంతో చదువుతున్న మంచి స్కూలు, చల్లావారిల్లు, బెజవాడ వదిలేసి హైదరాబాదు చేరాం. అక్కడ మా అమ్మమ్మ, తాతగారు, మావయ్య, అక్క అందరూ వుండడంతో మా అమ్మ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. అందరం కలిసి ఖైరతాబాదులో పెద్ద ఇల్లు అద్దెకి తీసుకున్నాం. మా ఇల్లు ప్రతిరోజూ పెళ్ళివారిల్లులాగానే వుండేది. రాత్రి ఎనిమిదయేటప్పటికి ఇంట్లోవాళ్ళందరూ మూడు బాచ్లుగా లిటరేచర్ పేకాట ఆడుతూ వుండేవారు. మేం అటు వెళ్ళినప్పుడల్లా 'పోయి చదువుకొండని' మమ్మల్ని తరిమేసేవారు. అసలు అప్పటికీ, ఇప్పటికీ కూడా నాకు పేకాట అంటే ఇష్టం వుడదు కాబట్టి నేనా పక్కకి వెళ్ళేదాన్నే కాదు.

అందులో ఆ రోజుల్లో టెలిఫోనులూ, సెల్ఫోనులూ ఏవీ వుండేవి కాదు కదా!

కావల్సినవాళ్ళు కళ్ళముందే వుండేవాళ్ళు. మావాళ్ళంతా పేకలాడుతూ అస్తమానం రాజన్నయ్య పెళ్ళిగురించే మాట్లాడుకునేవారు. ఎలాటి అమ్మాయి వస్తుందో ఏవిటో, ఏ సంబంధం కుదుర్తుందో, అసలు పెళ్ళెప్పుడవుతుందోనని మాట్లాడుకునేవాళ్ళు. అమలాపురం పెద్దనాన్న దగ్గర్నించి చీమలబారులాంటి చేతిరాతతో రోజూ తాతగారికి కార్డులు వచ్చేవి. అలా నాలుగయిదు నెలలు గడిచేటప్పటికి ఒకరోజు మధ్యాహ్నం రాజన్నయ్య వచ్చాడు. "ఇదేవిటబ్బా! ఇలా ట్రైనింగ్ మధ్యలో బెంగ పెట్టేసుకుని మాటిమాటికి వచ్చేస్తే ఎలా బాబూ" అనుకున్నా! అన్నయ్య ఇంటికి వచ్చిన అరగంటలోపే బెజవాడలో మా ఇంటికి వచ్చిన పెద్దమనిషి వచ్చారు. మా అన్నయ్య ఆయనకి తన ట్రైనింగ్ విశేషాలు చెప్తుండగానే అమ్మ లోపల్నించి గబగబా వచ్చి "అదేవిట్రా రాజూ! సరిగ్గా అష్టమి నవమిల్లో వచ్చావు! వీరి అమ్మాయితో కలిపి ముగ్గురు పిల్లలని చూడాలి. వాళ్ళకి పట్టింపులెక్కువ. ఎలా కుదుర్తుంది?" అనడిగింది. ఇంకా అన్నయ్య ఏమీ అనకముందే ఆయన కల్పించుకుని, "మాకలాటి పట్టింపులేమీ లేవండి. మీరు ఎప్పుడు వచ్చినా సంతోషమే" అని టైం స్థిరపరచుకుని వెళ్ళిపోయారు. వాళ్ళ కుటుంబంతో మాకస్సలు పరిచయం లేకపోవడం వల్ల ఆ సంబంధం గురించి ఇంట్లో ఎక్కువ మాటలే రాలేదు. రెండో అమ్మాయి వాళ్ళు చాలా మంచివాళ్ళు కానీ ఆ అమ్మాయి అందంగా వుండదు. ఇంక మూడో అమ్మాయి మా మామయ్య స్నేహితుడి చెల్లెలు. చాలా అందంగా వుండేది. ఆ అమ్మాయిని చేసుకుంటే బాగుంటుందని అనుకునే వాళ్ళు. కాని ఎవరూ పైకేమీ అనరు. అన్నయ్యముందు ఏమీ మాట్లాడకూడదని ముందే నిర్ణయించుకున్నారు. జరుగుతున్న హడావిడంతా చూశాక నాకు అర్థం అయింది, రాజన్నయ్య మామీద బెంగతో మమ్మల్ని చూడటానికి రాలేదూ... పెళ్ళికూతుళ్ళని చూడటానికి వచ్చాడూ అని.

ఒక్క మా నాన్నా, తాతగారూ తప్ప మిగిలినవాళ్ళమంతా తిథివార నక్షత్రాల పట్టింపు లేకుండా ముందుగా ఆ పెద్దాయనగారి అమ్మాయిని చూసి వచ్చాం. వాళ్ళు మా అన్నయ్యకి నచ్చేవిధంగా ఏపిల్‌పళ్ళు కోసిపెట్టి, అందరికీ వెండిగ్లాసుల్లో కమలాఫలాల రసం ఇచ్చారు.అట్లాగే అందరం కలిసి మిగతా అమ్మాయిలని కూడా చూశాం. ఈ రోజుల్లో పెళ్ళిచూపులంటే అమ్మానాన్నలకేం పని అంటున్నారు. అలాంటిది ఆ రోజుల్లో ఇంతమందిమి కట్టకట్టుకుని పిల్లామేకాతో సహా ఎలా వెళ్ళామా అని తల్చుకుంటేనే సిగ్గేస్తుంది. ఛ... పెళ్ళికొడుకెంత ఐ.ఎ.ఎస్. అయితే మాత్రం, వేమంతా ఎంత దగ్గర బంధువులమయితే మాత్రం, ఎంత మగపెళ్ళివారమయితే మాత్రం అవతల వాళ్ళేమనుకుంటారోననే ఆలోచన వుండాలి కదా! అయినా ఇన్నేళ్ళ తర్వాత ఎప్పటి సంగతులో తల్చుకుని నేనెందుకూ సిగ్గుపడడం?

పడను.

ఇంక పెళ్ళిచూపుల ప్రహసనాలు ముగిసి అన్నయ్య తిరుగు ప్రయాణం అయ్యాడు. తెల్లవారగట్లే లేచి నేను లెక్కలు చేసుకుంటుంటే అన్నయ్య భుజాన సంచీ తగిలించుకుని వెడుతూ వెడుతూ అమ్మతో "ఎ బి సి అనుకో పిన్నీ. నాకు ఎ నచ్చింది. నాన్నకి నువ్వే రాయి" అన్నాడు. అంతమాట నా చెవినపడ్డాక నానోరూరుకుంటుందా? "నాకూ ఎ నే నచ్చిందన్నయ్యా" అన్నా. నన్ను చూసి కొంచెం తత్తరపడి నా నెత్తిమీద ఒక్కటేసి వెళ్ళిపోయాడు హడావిడిగా. కాజీపేట వెళ్ళి ఢిల్లీ రైలు పట్టుకోవాలి మరి. కాసేపటికే మళ్ళీ ఖద్దరుబట్టలేసుకునే పెద్దమనిషిగారు రానే వచ్చారు. ఆయనని చూడగానే అమ్మ "అబ్బాయి తెల్లవారగట్లే వెళ్ళిపోయాడన్నయ్యగారూ! మా అక్కా బావా వుండేది అమలాపురంలో కదా. నా పాత్ర ఇంతవరకే! పిల్లవాడు సుముఖంగానే వున్నట్లున్నాడు. అక్కా బావలకి నాన్నగారి చేత వుత్తరం రాయిస్తాను. మీరు ఒక వారం వ్యవధిచ్చి అమలాపురం వెళ్ళి బావతో అన్నీ మాట్లాడుకోండి" అని ఆయనని పంపించింది.

ఆ వకీలుగారు పట్టు వదలని విక్రమార్కుడని అర్థం అయింది కదా! పెళ్ళి చూపులయి పిల్లా-పిల్లాడూ ఒకరికొకరు నచ్చుకున్నాక ఇంక ఆయనని ఎవరాపగలరు? సరిగ్గా వారం తిరిగేటప్పటికి ఆయన అమలాపురం వెళ్ళి పెద్దనాన్నకి కోపం రప్పించకుండా, కట్నకానుకలు, లాంఛనాలు అన్నీ వివరంగా మాట్లాడుకుని సంబంధం ఖాయం చేసుకున్నారు. హైదరాబాదులో తమకి మనిషి అండ లేదు కాబట్టి వాళ్ళ మామగారింట్లో పెళ్ళి చేస్తామన్నారుట. పెద్దనాన్నకి జాతకాలు ముహూర్తాలు చూడటం వచ్చు కాబట్టి వైశాఖమాసంలో పెళ్ళి ముహూర్తం కూడా పెట్టేశారు. ఆ తరువాత మాకు వియ్యంకుడిగారి వివరాలు కూడా తెలిశాయి. గొప్ప దేశభక్తుడు. గాంధీగారి ఉద్యమాలకని చాలా ఆస్తులు ధారపోసి హైకోర్టులో వకీలుగా పని చేస్తున్నారుట.

అన్నయ్య పెళ్ళని చెప్పి మా నలుగురికీ మా అమ్మ రెండేసి పట్టుపరికిణీలు కుట్టించింది. అందులో ఒక జతకి మా రాజన్నయ్య డబ్బిచ్చేస్తానన్నాడుట. ఎవరితోనూ చెప్పనని అమ్మదగ్గర మాట కూడా తీసుకున్నాడుట. సంబంధం మాఘమాసంలో నిశ్చయమైతే పెళ్ళి వైశాఖ మాసంలో! పెళ్ళి ముహూర్తం అప్పుడు ఏం కట్టుకోవాలో, బూజంబంతిలో ఏం కట్టుకోవాలో, స్నాతకం అపుడూ... ఇలా అన్నిటికి విడివిడిగా అనుకుని జాగ్రత్తగా సర్దుకున్నాం. పూనకం వచ్చినట్లు అందరం అదే ధోరణి.

ఇంక ఆ రెండు మూడు నెలలూ ఎప్పుడూ మా ఇంట్లో పెళ్ళి కబుర్లే! మర్యాదలవీ

ఎలా వుంటాయోనని మా అమ్మమ్మ మహా గాభరాపడిపోయేది. "అసలే అతనికి కోపం! వీళ్ళ గురించి మనకేమీ తెలియదు" అని బెంగ పెట్టేసుకునేది. ఎక్కడో పెళ్ళి అయితే ఇక్కడ మనం ఖంగారుపడి చేసేదేముంది. అందరూ అలా కబుర్లు చెప్పుకుంటూ వుండగానే వైశాఖమాసం రానే వచ్చింది. నాకిప్పటికీ అర్థంకానిదొకటుంది. ఇంకా పెళ్ళి ఇరవై రోజులుండగానే మా ఇంట్లో పిల్లల్ని మొత్తం ఏడుగురినీ పనివాడ్ని తోడిచ్చి మరీ అమలాపురం పంపేశారు. అంటే సెలవుల్లో మా గోల భరించలేకా? లేకపోతే మా అందర్నీ పంపమని ఆమ్మేవన్నా కబురుచేసిందా? సరే ఏదైతేనేం క్షేమంగా అమలాపురం చేరాము. మా పెద్దనాన్న మమ్మల్ని చూస్తూనే "ఇంత ఇరవైరోజుల ముందే వచ్చేశారేవిటే!" అన్నాడు. "పెళ్ళిపనులుంటాయి కదా పెద్దనాన్నా! అమ్మ నీకూ, ఆమ్మకీ సాయం చేయమంది" అన్నా. "ఏడిశావ్! ఎండల్లో నీ ముఠానేసుకు వూరమ్మట తిరిగావంటే హైదరాబాదు రైలెక్కిస్తా" అని ముందే బెదరగొట్టాడు ఎందుకైనా మంచిదని! అసలక్కడ నాకన్నా చాలా పాపులర్ అయిన మా అన్నయ్యల అసలు చెల్లెలుండేది. కాస్త నాకన్నా పెద్దది. మూడుపూట్లా తినడం, ఎండగా వున్నంతసేపూ ఎవరి అరుగులమీదో కూచుని చింతగింజలు, వామనగుంటలు ఆడ్డం, చల్లబడగానే కిరికాడ్డం (కిరికి అంటే తొక్కుడుబిళ్ళ). పైకూరికే కోప్పడేవాడు కానీ మా పెద్దనాన్న మాకు చాలా మర్యాదలు చేశాడు. పుస్తకాల కొట్టు నుంచి సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు కొమ్ముమిఠాయి, ఉల్లిపాయి పకోడీలు తెచ్చేవాడు. వాళ్ళ నరేంద్రపురం నుంచి ఒక బండెడు మావిడి పళ్ళు తెప్పించి కొట్టుగదిలో పోయించాడు. ఎవరయినా ఈజీగా ఇరవై తినేయచ్చు. అంతే మరి! ఒక్కొక్కటి చూడ్డానికి లడ్డూ అంత వుంటాయి. కానీ లోపలంతా టెంకే! పండుకొకటికీ చెంచాడు రసం కూడా రాదు.

పెళ్ళి ప్రయాణం రెండురోజులుందనగా అన్నయ్యలతో సహా అందరు చుట్టాలూ దిగారు. మొత్తం నలభైమంది దాకా అయుంటాం. ఇంక ప్రయాణం రోజున అమ్మ తెల్లారగట్లే సూరమ్మగారితో వంట చేయించి అన్నీ కారెజీలలో సర్దించింది. మొదటి బస్సులో బయలుదేరి బొబ్బర్లంక చేరేటప్పటికి పూర్తిగా తెల్లారిపోయింది. అందరం కాఫీలు తాగి కొట్టెంకబుట్టలు తిని లాంచీ ఎక్కాం. గంటలో లాంచీ మమ్మల్ని రాజమండ్రి చేర్చింది. అక్కడ రిక్షాలు చేసుకుని రాజమండ్రీ స్టేషనుకెళ్ళి భోజనాలు చేసి ఏలూర్లో ఆగే రైలెక్కి చీకటి పడేవేళకి చేరుకున్నాం. మా అన్నయ్య కోసం వచ్చే వకీలు గారే పెద్దవారు కదా! ఇంకాయన మావగారంటే ఇంకెంత పెద్దాయనో అనుకున్నా. కానీ ఆయన లేరు. ఎప్పుడో పోయారుట. ఇల్లు మాత్రం వుంది. ఒక్కోపుడు ఇళ్ళుంటాయి, మనుషులుండరు. ఇంకోపుడు మనుషులుంటారు, ఇళ్ళుండవు.

ఆయన మావగారింట్లో పెళ్ళని అన్నారు కానీ పెళ్ళి మావగారు చేస్తారనలేదు కదా. నాకు తెలిసీ తెలియనితనంతో ఏవేవో వూహించుకునేదాన్ని.

మా చెల్లాయి పిన్ని రైలు ఏలూరు వస్తోందనగా మా అందర్నీ కేకలేసింది. "తెల్లవారగట్ల లేచిన మొహాలు ఎలా వాడిపోయాయో! అందరూ కాస్త ముఖాలు కడుక్కుని జడలేసుకోండి స్టేషనుకి పెళ్ళివారొస్తారు" అని. "ఆ! ఎవరొస్తారు! ఎవరున్నారని? ఆ పెద్దాయనే వస్తారు. ఇపుడు సింగారించుకోవడం మా వల్ల కాదు. విడిదికెళ్ళాక చూద్దాం" అని ఆవిడని తలాయించేశాం. సరిగ్గా రైలు ఏలూరు స్టేషన్లో ఆగుతోండగానే బ్రహ్మాండంగా బాండుమేళం వినిపించింది. ఎర్రటి యూనిఫారం వేసుకుని సుమారు ఒక ఇరవైమంది గుండ్రంగా నిలబడి మంచి పాటలు వాయిస్తున్నారు. మేమంతా నెమ్మదిగా రైలు దిగేటప్పటికి కొందరు కూలీలు గబగబా లోపలికొచ్చి మా సామాన్లన్నీ దింపి పెట్టారు.

అయిదారుగురు సూట్లు వేసుకున్న మగవాళ్ళు, ఆకుపచ్చ పట్టుచీరలూ, పచ్చల రవల సెట్లు ధరించిన వారిభార్యలూ మా వైపుకి వచ్చి నమస్కారం చేశారు. అన్నయ్యలకి, అమ్మకి,  పెద్దనాన్నకి హారతిచ్చి మెడలో దండలేశారు. బొట్లు పెట్టి గంధం రాశారు. మా అందరికీ కూడా పన్నీరు, మల్లెపూలు జల్లి నెమ్మదిగా వెయిటింగ్ రూంకి తీసుకెళ్ళి కూచోపెట్టారు. ఇద్దరు ఫొటోగ్రాఫర్లు వచ్చి ఫొటోలు తీశారు. వాడిన మొహాలు, నలిగినబట్టలూ, రేగిన జుట్లూ ఇదీ మా మగపెళ్ళివారి అవతారం. వాళ్ళు సన్మానం చేస్తుంటే మాకు తల కొట్టేసినట్లయింది. పాపం చెల్లాయి పిన్ని చెప్పినట్లు వినుంటే కొంతయినా అవమానం భరించగలిగేవాళ్ళం కదా! వాళ్ళు పాపం మంచి వుద్దేశంతోనే మాకు మర్యాదలు చేస్తున్నా మేమే మాకు నచ్చట్లేదు. ఏదో మొహమాటంగా అనిపించింది. అసలు మగపెళ్ళివారంటే ఎలా వుండాలి? యుద్ధానికి సై అన్నట్లు గర్వంగా వుండద్దూ. ఏదైనా మంచి వుపాయం చెప్పేందుకు అమ్మ కూడా మాతో లేదు. ఆవిడ మా అత్తయ్య కొడుకు పెళ్ళికోసం మద్రాసు వెళ్ళింది. మర్నాడు కానీ రాదు. పెళ్ళివారు మా అందరికీ గాజుప్లేట్లలో జీడిపప్పు పకోడీలూ మైసూరుపాకూ టిఫిను పెట్టి చైనా కప్పుల్లో మంచి కాఫీ ఇచ్చారు. "ఇప్పుడివన్నీ ఎందుకమ్మా! ఎటూ విడిదికి వెడతాం కదా!" అని మా అమ్మ తెగ మొహమాటపడిపోయింది. "కాదత్తయ్యగారూ! మా తాతగారు ఈ వూరికి జమీందారు కదా! ఇపుడు ఆయన లేకపోయినా ఆచారాలన్నీ అలాగే వున్నాయి. మా వూరి ప్రజలందరికీ జమీందారుగారి మనవడెలా వుంటాడోనని చూడాలని సరదా వుంటుంది కదా! అందుకని వూరేగింపుగా వెళ్ళాలి. కనీసం ప్రయాణం రెండుగంటలు

పడుతుంది" అని ఆవిడ మర్యాదగా వివరం చెప్పింది.

బాండుమేళం, వాళ్ళ వెనుక గాస్‌లైట్లవాళ్ళు, బాణసంచా కాల్చేవాళ్ళు, కోలాటం ఆడే అమ్మాయిలు, వాళ్ళు వెనుక బుట్టబొమ్మలూ, ఆ వెనుక జీపులో రాజన్నయ్యా, తోడపెళ్ళికొడుకూ, అన్నయ్యలూ, పెద్దనాన్న, వాళ్ళ వెనక వరసగా కార్లలో మేమందరము రెండు గంటలపాటు వూరేగుతూ వాళ్ళ ఇంటికి చేరాం. ఆ ఇల్లు బయటనుండి చూడ్డానికి కోటలాగానూ, లోపల రెండు మూడు ఇళ్ళల్లాగానూ వుంది. అందులో ఒక భవంతిలాంటిది మాకు విడిదిగా ఇచ్చారు. మేం చేరగానే పెళ్ళికూతురి తల్లిగారు వచ్చి హారతిచ్చి వెళ్ళారు. ఆవిడ మాత్రం ఏ నగలూ వేసుకోకుండా ఖద్దరు చీర కట్టుకుని వున్నా ఎంతో అందంగా వున్నారు. మేమందరం స్నానాలు చేసి తయారయ్యాక భోజనాలకి బయల్దేరాం. మాకు దారి చూపించేందుకు ఒక భార్యాభర్తల జంట వచ్చి హాలువరకు తీసుకెళ్ళారు. అది పెద్ద డైనింగ్‌హాలు. పలకలు పలకలతో పింగాణి గచ్చు. వడ్డనకి చాపలేసి అరిటాకులలో కొంత వడ్డన చేసి వుంచారు. ప్రతి నాలుగు విస్తళ్ళ దగ్గరా చిన్న అరటిముక్కలో అగరువత్తులు గుచ్చి వుంచారు. ప్రతి ఆకులోనూ చిన్న చిన్న వెండి నేతి గిన్నెలు. మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన ఆడవాళ్ళంతా మంచి తెల్లటి షిఫాను చీరలు కట్టుకుని ముత్యాల నగలు పెట్టుకుని మంచి దేవకన్యల్లాగా నిలబడ్డారు వడ్డనవాళ్ళని అజమాయిషీ చేసేందుకు. వడ్డనవాళ్ళకి ఎర్రరంగు పట్టుపంచెలు యూనిఫారం. తల ఎత్తి చూస్తే మెరిసిపోతున్న దీపాలతో షాండిలీయర్లు. నిజంగా రాజావారి దివాణమే. మేం భోజనాలవగానే పెళ్ళికూతుర్ని చూడడానికి వెళ్ళాం. అబ్బ! ఎంత బాగుందో! లేత నీలం రంగు బనారస్ చీర, బంగారు జడ, జడ కుప్పెలు.. తను వేసుకున్న నగలలాంటివి నేను ఎక్కడా మళ్ళీ చూడలేదు, నేను వినను కూడా లేదు. అసలు బంగారం జడయితే అదే నేను మొదటిసారి చూడ్డం.

మర్నాడు పొద్దున్న స్నాతకం, భోజనాలు, మధ్యాహ్నం హరికథ, సాయంత్రం భరతనాట్యం, ఎదురు సన్నాహం, రాత్రి భోజనాలయ్యాక మంచి సంగీత కచేరి.. ఇంక అర్ధరాత్రి రెండు గంటలకి సుముహూర్తం. అలా అన్నీ వరసగా జరిగిపోయాయి. ఎన్నిటికని పిచ్చిమొహాల్లా ఆశ్చర్యపోతాం? పొద్దున్న ఫలహారాలయ్యాక ఆడపెళ్ళివాళ్ళొచ్చి అమ్మతో "అత్తయ్యగారూ! లాంఛనాలకి మీరేం కొనుక్కున్నారో అవి ఇస్తే మేం సరదాగా లాంఛనాలు జరుపుతాం" అనడిగారు. మా అమ్మ కొంచెం ఆలోచించి "వద్దులే అమ్మా! ఇవన్నీ మేం మావాడికి చెప్పలేదు. తెలిస్తే ఒప్పుకోడు. ఏం వద్దు" అని పంపేసింది. మరి తను మాత్రం ఏం చేస్తుంది? వాళ్ళిచ్చిన డబ్బుతో

కొన్న గాజులే కదా వీళ్ళు వేసుకుని పెళ్ళికి వచ్చింది?! పెళ్ళి తంతులూ, వేడుకలూ అన్నీ సలక్షణంగా పూర్తయ్యాయి. మగపెళ్ళివారింట్లో జరగబోయే సత్యనారాయణ వ్రతం కార్యక్రమానికి ఆడపెళ్ళివారు ఆరుగురం వస్తామని మాకు తెలియచేశారు. ఇంతమందికి అమలాపురం మహానగరంలో రాజలాంఛనాలు జరపడం అయేపనికాదు. మా అమ్మా అన్నయ్యా కలిసి చాలా సీరియస్‌గా ఆలోచించుకుని హైదరాబాదులో వ్రతం చేసుకుంటామని, అందర్నీ అక్కడికే రమ్మని ఆహ్వానించారు. పడుతూ లేస్తూ మా అమ్మా, శ్యామలక్కా కాస్త ముందస్తుగా వెళ్ళి ఏర్పాట్లు చేసారు. రాజమండ్రి రైలెక్కవలసిన వాళ్ళం హైదరాబాదు రైలెక్కాం. ఆడపెళ్ళివారెంత మంచివాళ్ళయినా ఏవిటో దేనికీ వంక పెట్టడానికి లేక, ఓ వాదులాట వేసుకోడానికి లేక, ఓ పేకాట ఏర్పాట్లు లేక మాలో చాలామందికి తనివి తీరలేదు. ఏవిటో! ఇన్ని పెళ్ళిళ్ళు చూసాను కానీ ఇలా ఆసాంతం నోరెత్తకుండా వున్నదీపెళ్ళిలోనే! తగవుల్లేకుండా పెళ్ళేవిటి చెప్పండి.